క్లుప్తంగా

శ్రీవారి సేవలో సినీ మ్యూజిక్ డైరెక్టర్ పట్నాయక్



చిన వెంకన్న ఆలయంలో ఆర్‌పీ పట్నాయక్

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల చిన వెంకన్న ఆలయాన్ని సినీ మ్యూజిక్ డైరెక్టర్ ఆర్‌పీ పట్నాయక్ ఆదివారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయన ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు వేద ఆశీర్వచనాన్ని పలికి శ్రీవారి ప్రసాదాలను అందజేశారు.

గణనాథుల ప్రతిమలు సిద్ధం



కొయ్యలగూడెంలోని కన్నాపురం రోడ్డులో విక్రయానికి సిద్ధంగా ఉన్న గణేష్ ప్రతిమలు

కొయ్యలగూడెం: వినాయక చవితి నేపథ్యంలో కొయ్యలగూడెంలోని పలు ప్రాంతాల్లో గణనాధుని ప్రతిమలను విక్రయానికి వ్యాపారస్తులు సిద్ధం చేశారు. కన్నాపురం రోడ్డులోని గున్నేపల్లి సుబ్బారావు అనే వ్యాపారి తెలంగాణ రాష్ట్రంలో తయారైన గణనాధుని విగ్రహాలను విక్రయిస్తున్నాడు. మూడు అడుగులు ఎత్తు మొదలుకుని ఆరు అడుగుల ఎత్తు ఉన్న విగ్రహాలను సిద్ధం చేసి తీసుకువచ్చామని, 12 అడుగుల భారీ విగ్రహాలను ఆర్డర్‌పై తయారు చేస్తున్నట్లు తెలిపాడు. రూ.3 వేల నుంచి రూ.18 వేల వరకు విగ్రహాన్ని బట్టి ధర నిర్ణయించి ఆర్డర్లు తీసుకున్నట్లు తెలిపారు.

అంజన్నను దర్శించుకున్న నటి సహర్ కృష్ణన్



ఆలయ ప్రాంగణంలో నటి సహర్ కృష్ణన్

జంగారెడ్డిగూడెం రూరల్: గుర్వాయిగూడెంలోని శ్రీ మద్ది ఆంజనేయ స్వామివారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 2018 మిస్ ఆంధ్రప్రదేశ్, శ్రీదేవి డ్రామా కంపెనీ ఫేమ్, ఊరి చివర వంటి చిత్రాల్లో నటించిన హీరోయిన్ సహర్ కృష్ణన్ స్వామివారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆమెకు ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. పాలక మండలి చైర్మన్ కీసరి సరిత, ధర్మకర్తలు మల్నీడి బాబీ, ఆలయ పర్యవేక్షకుడు జవ్వాది కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అధ్యాపకురాలు సూర్యకుమారికి సన్మానం

కొయ్యలగూడెం: ప్రకాశం డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు ఎంఎస్‌వీ సూర్యకుమారి రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపకురాలిగా ఎంపికయ్యారు. ఆదివారం సమాఖ్య ప్రైవేట్ అధ్యాపక, ఉపాధ్యాయుల సంస్థ (ఎస్‌పీఎల్‌టీవో) ఆధ్వర్యాన గుంటూరు ఏసీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో తనను ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు సత్కరించినట్లు ఆమె తెలిపారు. సూర్యకుమారిని ఎస్‌పీఎల్‌టీవో వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ నాగయ్య, రాష్ట్ర అధ్యక్షుడు సురేష్, కరస్పాండెంట్ టి.జనార్దన్, డైరెక్టర్ టి.పార్థసారథి, ప్రిన్సిపాల్ సీహెచ్ హనుమాన్ చౌదరి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుల ఎన్నిక

కొయ్యలగూడెం: వైఎస్సార్ సీపీ రామానుజపురం, యర్రంపేట గ్రామాలకు కమిటీ అధ్యక్షులుగా గేలం ధర్మరాజు, చింతలపూడి కిషోర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పార్టీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం జరిగిన గ్రామ కమిటీల సమావేశంలో ఈ మేరకు నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు నిర్ణయం తీసుకున్నారని, ఇరువురు అధ్యక్షుల నియామకంపై ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ద్వారా పార్టీ జిల్లా కార్యాలయానికి సమాచారం పంపినట్లు పేర్కొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని గ్రామ కమిటీ అధ్యక్షుల నియామకాన్ని ప్రకటిస్తారని తెలిపారు.

నెరుసు నాగసత్యంకు సత్కారం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తిరుమల, తిరుపతి దేవస్థానాల ట్రస్ట్ బోర్డు సభ్యునిగా నియమితులైన నెరుసు నాగ సత్యంను స్థానిక లక్ష్మీవారపుపేటలోని ఏఆర్‌డీజీకే స్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు ఆదివారం ఘనంగా సన్మానించారు. నాగసత్యం ఏఆర్‌డీజీకే స్కూల్‌లో 1989, 90 సంవత్సరాల్లో విద్యాభ్యాసం చేశారు.

ఏళ్లనాటి సమస్యకు పరిష్కారం

- వెంకటకృష్ణాపురం బీసీ కాలనీలో డ్రెయినేజీల నిర్మాణం
- రూ.30 లక్షలతో చేపట్టిన పనులు దాదాపుగా పూర్తి
- ప్రజలకు వరంగా మారిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



గ్రామంలో రహదారి పక్కన నిర్మించిన డ్రెయినేజీ

ద్వారకాతిరుమల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికైంది. మండలంలోని వెంకటకృష్ణాపురంలో తిష్ట వేసిన ఏళ్లనాటి సమస్యకు ఈ కార్యక్రమం ద్వారా పరిష్కారం లభించింది. స్థానిక బీసీ కాలనీవాసులను దశాబ్దాల కాలంగా డ్రెయినేజీ సమస్య వేధిస్తోంది. ఇళ్ల వద్ద, అలాగే రహదారి పక్కన డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోయేది. వర్షం వస్తే చాలు ఇళ్లన్నీ నీటమునిగిపోయేవి. వర్షం వెలసిన తర్వాత రెండు మూడు రోజుల వరకు నీరు బయటకు పోయేది కాదు. ఈ సమస్యలన్నింటికీ డ్రెయినేజీలు లేకపోవడమే కారణమని కాలనీవాసులు ప్రజాప్రతినిధుల వద్ద పదేపదే తమ గోడును వెళ్లబుచ్చేవారు. అయినా ఆ సమస్యకు చెక్ పడలేదు. 2019లో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన టీడీపీ నేతలను సైతం కాలనీవాసులు నిలదీశారు. డ్రెయినేజీలు కట్టలేని మీరు ప్రచారాలకు రావొద్దని తెగేసి చెప్పారు. ఇదిలా ఉంటే గతేడాది జూన్ 1న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా కాలనీలో ఇంటింటికీ వెళ్లిన గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు వద్ద ఆ ప్రాంత వాసులు డ్రెయినేజీ సమస్యపై ఏకరువు పెట్టారు.

హామీ ఇచ్చిన వెంటనే..

హామీ ఇచ్చిన వెంటనే ఎమ్మెల్యే తలారి గడప గడపకు నిధులు రూ. 20 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ. 10 లక్షలను డ్రెయినేజీ నిర్మాణానికి వెచ్చించారు. అయితే కాలనీకి దిగువ ప్రాంతంలో పంట పొలాలు ఉండటంతో అక్కడి రైతులు డ్రెయినేజీ నిర్మాణానికి అభ్యంతరం తెలిపారు. దాంతో నల్లజర్లకు చెందిన ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో ఎమ్మెల్యే చర్చించి, సమస్య పరిష్కారానికి మార్గాన్ని అన్వేషించారు. ఎగువ ప్రాంతంలో ఉన్న చెరువులోకి మురుగునీరు పారేలా ప్లాన్‌ను రూపొందించి, దానికి అనుగుణంగా డ్రెయినేజీ నిర్మాణ పనులను 40 రోజుల క్రితం చేపట్టారు. ఈ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. దాంతో తమ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే చొరవతోనే..



గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు చొరవతోనే డ్రెయినేజీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మెరక ప్రాంతం మీదుగా మురుగునీరు పారడం సాధ్యం కాదని గతంలో ఎంతో మంది అధికారులు, ప్రజాప్రతినిధులు చేతులెత్తేశారు. అయితే ఎమ్మెల్యే తలారి పట్టు విడవకుండా సమస్య పరిష్కారానికి కృషి చేశారు.

– సర్నాల శ్రీరామమూర్తి, బీసీ కాలనీ, వెంకటకృష్ణాపురం.

డ్రెయినేజీలు నిర్మిస్తారనుకోలేదు



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వచ్చిన ఎమ్మెల్యే తలారి వెంకట్రావుకు డ్రెయినేజీ సమస్యలను తెలిపాం. అయితే గత నాయకుల వలే ఆయన కూడా పట్టించుకోరని అనుకున్నాం. కానీ ప్రత్యేక దృష్టి సారించి, డ్రెయినేజీల నిర్మాణానికి ఆయన శ్రీకారం చుట్టారు. – ఎస్.తులసి, బీసీ కాలనీ, వెంకటకృష్ణాపురం.

చాలా సంతోషంగా ఉంది



ఇక ఈ జన్మలో డ్రెయినేజీలు నిర్మిస్తారని అనుకోలేదు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఎమ్మెల్యే తలారి మా సమస్యకు శాశ్వత పరిష్కార మార్గాన్ని చూపారు. రూ.30 లక్షలు వెచ్చించి, డ్రెయినేజీలను నిర్మిస్తున్నారు. నిన్నమొన్నటి వరకు ఇళ్లలోని మురుగునీరు, వర్షపునీరు బయటకు పారక ఎన్నో ఇబ్బందులు పడ్డాం.

– ఎస్.కృష్ణవేణి, బీసీ కాలనీ, వెంకటకృష్ణాపురం,

గణపతికి గరిక పూజ



గరిక పూజ నిర్వహించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: సంకట హర చతుర్థి పర్వదినం పురస్కరించుకుని జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెంలోని శ్రీ అయ్యప్పస్వామి క్షేత్రం ఉపాలయంలో కొలువై ఉన్న కన్నె మూల గణపతి క్షేత్రంలో స్వామివారికి గరిక పూజ నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకులు గణనాధునికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గరిక పూజ చేసి విశేషంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి దర్శించుకున్నారు. అయ్యప్ప ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

గుబ్బల మంగమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం: మండలంలోని కామవరం సమీపాన అటవీ ప్రాంతంలో కొలువై ఉన్న గుబ్బల మంగమ్మతల్లిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

మంచి నడవడికతో జీవించాలి



కౌన్సిలింగ్ చేస్తున్న జంగారెడ్డిగూడెం డీఎస్పీ ధనుంజయుడు

జంగారెడ్డిగూడెం: సమాజంలో మంచి నడవడికతో ఉన్నతంగా జీవించాలని జంగారెడ్డిగూడెం డీఎస్పీ ధనుంజయుడు సూచించారు. రౌడీషీట్‌లు నమోదైన వారికి ఆదివారం డీఎస్పీ కార్యాలయంలో ఆయన కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ తెలిసో, తెలియకో కేసుల్లో ఇరుక్కుని రౌడీషీట్ నమోదైన వారి కుటుంబం ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటుందో తెలుసునన్నారు. ప్రతి ఒక్కరితో వేలెత్తి చూపించుకోవడం ఆయా వ్యక్తుల కుటుంబ సభ్యులకు మనోవేదన కలిగిస్తుందన్నారు. రౌడీసీట్ నమోదైతే అదేదో పదవి అన్నట్లుగా ఎవరైనా సెటిల్‌మెంట్‌లు తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు కఠినంగా తీసుకుంటామన్నారు. ముఖ్యంగా ప్రజా శాంతికి భంగం కలిగించేలా వ్యవహరిస్తే అటువంటి వారిని ఉపేక్షించేది లేదన్నారు. మంచి నడవడికి కలిగి జీవనం సాగించాలని, అలా ఉన్న వారి రౌడీషీట్‌లను తొలగించేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామన్నారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం సీఐ పి.రాజేష్, ఎస్సై ఎం.సాగర్‌బాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీ షీటర్‌లకు కౌన్సిలింగ్

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): జీలుగుమిల్లి సర్కిల్ స్టేషన్ పరిధిలో ఉన్న 21 మంది రౌడీ షీటర్‌లకు పోలవరం డీఎస్పీ ఎం.శ్రీనివాసులు ఆదివారం కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా శాంతికి భంగం కలిగించేలా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే రౌడీ షీటర్‌లు వారి జీవనానికి ఏఏ వృత్తుల్లో కొనసాగుతున్నారనే విషయాలపై ఆరా తీశారు. అందరూ సత్ప్రవర్తన కలిగి ఉండాలని, అటువంటి వారిపై రౌడీ షీట్‌ను తొలగించేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీఐ బి.వెంకటేశ్వరరావు, ఎస్సై వి.చంద్రశేఖర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పెద్దిరాజుకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెం జెడ్పీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు పెద్దిరాజును సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ద్వారకాతిరుమల: గురుపూజ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పంగిడిగూడెం హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు మద్దాల పెద్దిరాజుకు జిల్లా లయన్స్ క్లబ్ ఏలూరులోని క్లబ్ కార్యాలయంలో ఆదివారం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ప్రదానం చేసింది. ఆయనను దుశ్శాలువాతో సత్కరించి, ప్రశంసా పత్రం అందజేశారు. విద్యారంగం, విద్యా వ్యాప్తి, విద్యార్థుల ఉన్నతికి, సామాజిక సేవలకు గానూ ఆయనకు ఈ అవార్డును అందించినట్టు లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గట్టెం మాణిక్యాలరావు తెలిపారు. కార్యక్రమంలో ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, డీఈఓ శ్యామ్‌సుందర్, లయన్స్‌క్లబ్ సభ్యులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడు వేణుగోపాలరావు

లింగపాలెం: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా లింగపాలెం మండలం కలరాయనగూడెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.వేణుగోపాలరావు ఎంపికయ్యారు. ఆయనను పలువురు ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

సీపీఎం రణభేరి ర్యాలీ



కొయ్యలగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

కొయ్యలగూడెం: స్థానిక మత్స్యకారుల వీధిలో ఆదివారం సీపీఎం రణభేరి కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు నిర్వహించాయి. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రచారం చేస్తూ ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. స్థానిక సమస్యలను ప్రజలు నాయకులకు వివరించారు. డ్రెయినేజీ, రోడ్డు సమస్యలను పరిష్కరించాలని కోరారు. పరింపూడి ఎస్సీ పేటలో డ్రెయినేజీ లేక ఇబ్బందులు పడుతున్నామని, దేవుడు మాన్యం యానాదులు పేట ఇళ్ల స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపారు. కార్యక్రమంలో ఆకులు వెంకటలక్ష్మి, గుర్రాణ లక్ష్మి, ఎ.సూర్యనారాయణమ్మ, జక్కు వెంకటలక్ష్మి, మార్బోయిన వెంకటలక్ష్మి, సుబ్బారావమ్మ, కుంచే సిద్ధమ్మ, ఎ.అరుణ కోణాల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణకు కృషి చేద్దాం



జంగా గోపాల్‌ను సత్కరిస్తున్న నాయకులు, అధికారులు

ఏలూరు (టూటౌన్): వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని ఏలూరు తహసీల్దార్ బి.సోమశేఖర్ అన్నారు. స్థానిక అశోక్ నగర్ ద్వారక గార్డెన్స్‌లో ఆదివారం వినియోగదారుల సంఘాల ప్రతినిధుల సమావేశం విద్యావేత్త, వినియోగదారుల ఉద్యమ నాయకుడు జంగా గోపాల్ అధ్యక్షతన ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తహసీల్దార్ సోమశేఖర్ మాట్లాడుతూ జంగా గోపాల్ వినియోగదారుల ఉద్యమానికి చేసిన కృషిని కొనియాడారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు బొబ్బిలి బంగారయ్య మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల పరిరక్షణకు మరింతగా పనిచేయాలన్నారు. ప్రస్తుతం వినియోగదారుల ఉద్యమం బలహీనంగా ఉందని, మండలాలు, గ్రామాల్లో వినియోగదారుల సంఘాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కొవ్వలి వినియోగదారుల సేవా మండలి అధ్యక్షుడు, న్యాయవాది కట్టా సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలు విడిపోయిన తర్వాత ప్రస్తుతం వినియోగదారుల ఉద్యమం బలహీనంగా ఉందన్నారు. ఉద్యమం మరింత ముందుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. వినియోగదారుల చట్టం 2019పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా జంగా గోపాల్‌ను దుశ్శాలువా కప్పి పుష్పమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తణుకు వినియోగదారుల సంఘం అధ్యక్షుడు జీఎస్‌ఆర్ శంకర్, చింతలపూడి అధ్యక్షుడు మొహిద్దీన్, ఎల్డర్స్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ పుష్పాంజలి, జంగా గోపాలరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తండ్రి చెంతకు తప్పిపోయిన బాలుడు



ఏలూరు త్రీటౌన్ స్టేషన్‌లో బాలుడ్ని తండ్రికి అప్పగించిన సీఐ శివాజీ

ఏలూరు టౌన్: ఏలూరు శాంతినగర్ ప్రాంతంలో తల్లిదండ్రులతో కలిసి చర్చికి వచ్చిన బాలుడు బయట కొచ్చి తప్పిపోయాడు. చర్చిలో సండేస్కూల్ జరుగుతుండగా ఆడుకుంటూ బయటకు వచ్చిన చిన్నారి రోడ్డుపైకి వచ్చి ఎటెళ్లాలో తెలియక తప్పిపోయాడు. ఒంటరిగా రోడ్డుపై తిరుగుతున్న బాలుడ్ని గుర్తించిన వినోద్‌కుమార్ అనే వ్యక్తి త్రీటౌన్ స్టేషన్‌కు తీసుకొచ్చి పోలీస్ అధికారులకు అప్పగించాడు. బాలుడు కొక్కిరాయిలంక గ్రామానికి చెందిన డేవిడ్‌గా పోలీసులు గుర్తించారు. ఆగడాలలంకలో ఒక స్కూల్లో చదువుతున్నట్టు తెలుసుకున్నారు. సీఐ కోమాకుల శివాజీ బాలుడి తండ్రి అశోక్‌ను త్రీటౌన్ స్టేషన్‌కు పిలిపించి డేవిడ్‌ను అప్పగించారు. బాలుడిని స్టేషన్‌కు తీసుకువచ్చిన వినోద్‌కుమార్‌ను పోలీసులు, డేవిడ్ తండ్రి అభినందించారు.

జూదరుల అరెస్ట్

భీమడోలు: గుండుగొలను గ్రామంలో పేకాట శిబిరంపై ఆదివారం సాయంత్రం పోలీసులు దాడి చేశారు. ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి, రూ. 4,550, రెండు మోటార్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చావా సురేష్ కుమార్ తెలిపారు.

తెలుగు భాష ఔన్నత్యానికి కృషి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తెలుగు భాషా ఔన్నత్యం కోసం శ్రీశ్రీ కళా వేదిక నిరంతరం కృషి చేస్తోందని శ్రీశ్రీ కళా వేదిక జిల్లా కమిటీ ప్రతినిధులు తెలిపారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని గత నెల 27న శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో జాతీయ శతాధిక కవి సమ్మేళనం ఏలూరులో విజయవంతమైన సందర్భంగా ఆదివారం ఏలూరులోని ఫ్లాష్ కదలిక కార్యాలయంలో విజయోత్సవ సభ నిర్వహించారు. శ్రీశ్రీ కళా వేదిక జాతీయ కన్వీనర్, అంతర్జాతీయ సమన్వయ కర్త కొల్లి రమావతి, ఫ్లాష్ సంస్థ ప్రతినిధి వెంకట రాంబాబు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. కవి సమ్మేళనం విజయవంతమవ్వడానికి సహకరించిన ప్రముఖులను ఏలూరు జిల్లా కార్యవర్గం అధ్యక్షుడు శ్రీహరికోటి, గౌరవాధ్యక్షుడు డాక్టర్ టి.పార్థసారధి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీహరి కోటి మాట్లాడుతూ శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ చైర్మన్, అంతర్జాతీయ తెలుగు సాహిత్య, సాంస్కృతిక అకాడమీ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర కార్యవర్గానికి ఎన్నికైన వారిని మహిళా అధ్యక్షురాలు శ్యామలా హరికోటి ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక గౌరవ సలహాదారులు లేళ్ల వెంకటేశ్వరరావు, ఈమని శేషయ్య, జిల్లా కన్వీనర్ జి.కృష్ణ మనోహర్, కో కన్వీనర్ ఎంజే సుజయ్ కృష్ణ, ప్రధాన కార్యదర్శి మానుకొండ చిన్నయ్య, మహిళా ప్రధాన కార్యదర్శి అనూరాధ పురం, కార్యదర్శులు ఎంఎస్వీ ప్రసాద్, దారామోహనరావు, ఎస్‌కేడీ ప్రసాద్, శిఖా ఆకాష్, గోరింక ఐజక్, యూత్ విభాగం కార్యదర్శులు పురం శ్రీరంగ కార్తికేయ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనలో కేంద్రం విఫలం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సాబ్జి

ఏలూరు (టూటౌన్): యువతకు ఉపాధి కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి విమర్శించారు. స్థానిక పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షతన దేశంలో నిరుద్యోగ సమస్య – ప్రభుత్వాల వైఖరి అనే అంశంపై అఖిలపక్ష రాజకీయ పార్టీలు, విద్యార్థి యువజన ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సాబ్జి మాట్లాడుతూ ప్రధాని మోదీ ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాలు ఇస్తానని ఇచ్చిన హామీని అమలు చేయలేదన్నారు. రైల్వే, టెలికాం, బ్యాంకింగ్, బీమా వంటి ప్రభుత్వ రంగ సంస్థలనూ ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం వల్ల దేశంలో కోట్లలో ఉద్యోగాలు ఖాళీలు ఏర్పడ్డాయని వివరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రవి, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగం, అధిక ధరలు, విద్యుత్ చార్జీలు ప్రధాన సమస్యలుగా ఉన్నాయన్నారు. జిల్లాలో ఏలూరు జూట్ మిల్లు, భీమడోలు షుగర్ ఫ్యాక్టరీల మూసివేతను గుర్తుచేశారు. రాజనాల రామ్మోహన్‌రావు (కాంగ్రెస్), షేక్ మస్తాన్ (ఆప్), గుబ్బల నాగేశ్వరరావు (భారత్ బచావో), డీఎన్‌వీడీ ప్రసాద్ (సీఐటీయూ) తదితరులు మాట్లాడారు. జి.సూర్యకిరణ్ (డీవైఎఫ్ఐ), కె.లెనిన్ (ఎస్ఎఫ్ఐ), క్రాంతి (పీడీఎస్‌యూ), కె.శ్రీనివాస్ (ఏపీ రైతు సంఘం), పి.ఆదిశేషు (చేతివృత్తిదారుల సంఘం) తదితరులు పాల్గొన్నారు.

మహిళలను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు

ఏలూరు (టూటౌన్): మహిళలు, బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి, ఇబ్బందులకు గురిచేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏలూరు దిశ డీఎస్పీ నున్న మురళీకృష్ణ అన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రజక జన సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య ఆధ్వర్యంలో దిశ డీఎస్పీని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. లింగపాలెం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన యువకుడు, ఏలూరు సత్రంపాడుకు చెందిన యువతి భార్యాభర్తలు. వీరి మధ్య వచ్చిన మనస్పర్థల కారణంగా దిశ పోలీస్‌లను ఆశ్రయించారు. డీఎస్పీ భార్యాభర్తలిద్దరికీ కౌన్సిలింగ్ ఇచ్చారు. వివిధ సమస్యలతో దిశ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించే వారికి పరిష్కారం నిమిత్తం కౌన్సెలింగ్ ఇస్తున్నట్టు చెప్పారు. అప్పటికీ వినకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు. సమస్య పరిష్కారానికి కృషిచేసిన డీఎస్పీకి మురళీకృష్ణకు కట్లయ్య కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రజక యూత్ ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు, నాయకులు పున్నపు నరసింహారావు, కడిలి సుబ్బయ్య, కొమ్మంటి మురళీధర్, అన్నవరం, జంగారెడ్డిగూడెం శ్రీనివాస్, ప్రసన్న తదితరులు ఉన్నారు.

8న ఆశా వర్కర్ల ఆందోళన

ఏలూరు (టూటౌన్): హర్యానా రాష్ట్రంలో ఆగస్టు 8 నుంచి ఆశావర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మెపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలని కోరుతూ ఈనెల 5న ఆందోళన చేస్తామని ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు కె.పోశమ్మ తెలిపారు. స్థానిక నరసింహారావుపేటలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో కమల అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో పోశమ్మ మాట్లాడారు. హర్యానాలో ఆశావర్కర్లు సమస్యల పరిష్కారం కోరుతూ గత 25 రోజులుగా సమ్మె చేస్తున్నారని, ఆగస్టు 27న శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్లు, సీఐటీయూ నాయకులను లాఠీ చార్జీ చేసి అక్రమంగా అరెస్టు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలైన ఆశావర్కర్లు పట్ల హర్యానా పోలీసులు అమానుషంగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేశారు. అరెస్టు చేసిన ఆశా వర్కర్లకు కనీసం మంచినీరు ఇవ్వకుండా టాయ్‌లెట్ సౌకర్యం కల్పించకుండా హింసించారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా హర్యానా ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని ఆశావర్కర్ల న్యాయమైన డిమాండ్లను అంగీకరించాలని కోరారు. సమావేశంలో జిల్లా నాయకులు రోజా, నాగమణి, కామేశ్వరి, పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి : మండలంలోని రాట్నాలకుంటలో వేం చేసియున్న శ్రీ రాట్నాలమ్మ ఆలయానికి ఆదివారం జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ వారం అమ్మవారికి పూజా టిక్కెట్ల ద్వారా రూ.43,760, విరాళాల ద్వారా రూ.25,007, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.34,840, ఫొటోల ద్వారా రూ.4,830 ఆదాయం లభించిందని దేవస్థానం చైర్మన్ చల్లగొళ్ల వెంకటేశ్వరరావు తెలిపారు.